# బరిబత్తల బొమ్మ

రాత్రి దాదాపు పదకొండు గంటలు దాటి ఉంటుంది. హైదరాబాదు నుండి వచ్చే చివరి బస్సు కూడా వచ్చేసింది. అప్పటికే సినిమా మొదటి ఆట వదిలి చాలా సేపైంది. రెండో ఆట ముగియడానికి యింకా వో అరగంటకు పైనే వ్యవధి వుంది. సన్నగా వానతుంపరలు కూడా పడ్తున్నాయి. దాదాపు రోడ్లన్నీ నిర్మానుష్యంగానే కన్పిస్తున్నాయి. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ అప్పుడప్పుడు వినిపించే ఊరకుక్కల భౌ భౌలు తప్ప మరే జీవి అలికిడి వినిపించడం లేదు.

మా వారు బాగా అలసిపోయారేమో గాఢనిద్రలో వున్నారు. మా ఇద్దరి మధ్యలో మహరాజులా నిద్రపోతున్న మా గారాల బుచ్చమ్మ అంటే మాబుజ్జి నాన్న కలగన్నట్లు లేస్తూ బ్రహ్మాండాన్ని కబళించే ఆకలితో వున్న ఆదిబిక్షువులా 'కావురు', 'కావురు' మంటూ గుక్కపట్టి ఏడ్పు అందుకున్నాడు. ఆ ఏడుపు రహస్యం. వాడి కడుపు ఆత్రం తెలిసిన నేను నిద్రలో కూడా మేల్కొన్న తెలివితో కళ్లు విప్పకుండానే అటునుండి ఇటు తిరిగి వాడి నోటికి కావలసిన అమృత కలశాన్ని అందించాను.

చేపుకుని స్రవించే పాలధారలను 'గుర్రు, గుర్రు మంటూ, వాళ్ల నాన్నకు మెలకువ వచ్చేంత చప్పుడు చేస్తూ మింగుతున్నాడు.

' ఏరా! పడుకోనివ్వవా? అంటూ మా వారు మగతగా మెసుల్తూ మరో వైపు తిరిగి పడుకున్నారు.

ఇంటి వెనక దొడ్డివైపు ఏదో శబ్దం లీలగా వినిపించినట్లైంది. రాత్రిపూట ఎలకల వేటకు వెళ్లేపిల్లో? కాక, కుక్కో? అయివుంటుందని సరిపెట్టుకున్నాను. కాదు. ఆ ధ్వని యింతకింతకు పెద్దదౌతూ స్పష్టంగా వినిపించడం ప్రారంభమైంది.

ఎవరో? తలుపులు ఆత్రంగా బాదుతున్నారు. ఎవరై వుంటారు? దొంగలా? కాదు ఎవరినో శత్రువులో, రౌడీలో వెనక వైపునుండి తరుముకు వస్తూవుంటే ప్రాణభయం కొద్దీ పరుగెత్తి 'కాపాడుమంటూ' రక్షణకోసం అర్థిస్తున్నట్లుంది ఆ ధ్వని.

ఏమైనా ఈ శబ్దం మాత్రం మామూలుగా లేదు.

'ఏవండీ! మనదిడ్డి తలుపులు ఎవరో చాలా సేపట్నుంచి కొడ్తున్నారు. నన్ను వెళ్లి చూడమంటారా? అంటూ భయం భయంగానే పూర్తిగా మెలకువ వచ్చీరాని స్థితిలో వున్న మావారిని లేపే ప్రయత్నం చేస్తున్నాను.

అప్పటికే తన చిట్టి బొజ్జ నింపుకుని, పరమయోగిలా ఆనందంగా నిద్రలోకి జారుకున్నాడు మా బుజ్జి నాన్న. వాడికి దుప్పటి సర్దికప్పుతూ వుంటే ఇందాకటి శబ్దంలో వేగం, ఆత్రం మరీ రెట్టించింది.

ఇదేదో? నేనే చూచివస్తానంటూ లేవబోతూ వుంటే, మావారు కళ్లు నులుపుకుంటూ లేచి ' ఆగు, ఎక్కడికి? నేను వెళ్లి చూస్తాన్లే' అంటూ పక్కనే వున్న షర్టు తొడుక్కుని దిడ్డి గుమ్మంవైపు నడిచారు.

వారలా వెళ్లిన రెండు మూడు నిముషాలకే 'శారదా!' అంటూ మావారు పెట్టిన వెర్రికేక వినిపించింది.

ఆ కేక వెంబడే నేను ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్టుగా లేస్తూ పక్కలో వున్న పసికందును కూడా పట్టించుకోకుండా దిడ్డి వైపు పరుగెత్తాను.

ఎదురుగా నాకంట పడ్డ దృశ్యాన్ని చూచి తూలిపడబోతూ, మావారి భుజం ఆసరాగా నిలదొక్కుకున్నాను. నోటమాట పెకిలి ఎవ్వరికీ ఇవతలికి రావటం లేదు.

ఇంతవరకూ మావారు చూచిందీ. ఇప్పుడు నేను చూస్తున్నదీ ఒకటే దృశ్యం. అది మాటలకు అందని పరమ దయనీయమైన అవస్థ.

ఆమె వో నగ్నస్త్రీ మూర్తి. ఆమె పొంగులువారే యౌవనంలో వున్న సొగసుకత్తె. అవయవాలన్నీ సువిభక్తమై ఎత్తు వొంపుల పొందికతో సుతారంగా తీర్చి పోతపోసిన కంచు విగ్రహంలా వుంది.

అయినా అంతటి సౌందర్యం కంటికి యింపుగా లేదు. కల్లు చుక్కకలిసిన పాలకడవలా, కలెబడిన కుక్కలు చించిన వడ్డించిన విస్తరిలా, విషలిప్తమైన అమృతాన్నంలా వ్యర్థమై వెగటునూ వోకిలింపునూ కల్పిస్తూంది.

పరమ ఆకర్షణీయమైన ఆ శరీరం చెప్పరాని శిక్షలకు గురైనట్లుంది: పంటిగాట్లతో కందిన చెక్కిళ్లూ, గోటి గీరలతో, నెత్తుటి చారలతో పొత్తు కుదుర్చుకున్న అవయవాలూ మాంసలాలై మాలూరఫలాల్లా, కొబ్బరి గిన్నెల్లా కుదురైన పాలిండ్లూ, కటిని దాటి చెల్లా చెదురైన మబ్బుతెరల్లా విరబోసుకున్న కురులూ, దానికి తోడు స్థానచ్యుతమై చెవి వెనుకవైపు, తలకు తట్టుకుని అసహ్యంగా వ్రేలాడుతున్న రవికతో, ఏనుగు తొక్కిన సోమలతలా

అపాదమస్తకం పాడువారిన ఆమె సొగసు, చూచే కంటికి ఏమాత్రం యింపు నింపక, ఏదో జుగుప్సతో కూడిన భయోద్రేకాలను రేకెత్తిస్తూంది.

ఇంతవరకూ ఏ స్పందనా లేక కొయ్యబారినట్లున్న ఆ స్త్రీ, తోటి స్త్రీగా నన్నూ చూడగానే ఏదో స్పృహ కలిగినట్లు కొంత చలిస్తూ తన్ను తాను దాచుకోవటానికి ప్రయత్నించినట్లు కనిపిస్తుంది. కానీ తనకు మిగిలిన అరిటాకుల్లాంటి ఆ రెండు చేతుల్తో ఏ భాగాన్ని ఎట్లా ? కప్పుకోవాలో తెలియక నిస్సహాయంగా కూలబడిపోయింది.

అత్యాచారానికి గురై అవమానంతో, దుఃఖంతో వాడివత్తై కుప్పకూలిన తామరతూడులా వున్న ఆ స్త్రీ రాశిబోసిన విషాదంలా కన్పిస్తూంది.

చూస్తున్న కొద్దీ, ఆ దృశ్యం, వింతగా రెక్కలు విప్పుకుని, దుస్స్వప్న గత భీతిలా, అందరినీ ఆ పొగమబ్బుల్లోకి లాక్కెళ్లేలా వుంది.

వికటించిన కాలంతో పోరాడలేక, రాజీపడలేక, సంఘం పెట్టిన రాపులకు గురై, ఉడికి చివరకు మైనపు ముద్దలా మిగిలిన ఆ వ్యక్తి వికృతదృశ్యం, కామరూప పిశాచి పాశవికపు చేతుల్లో నలిగి నుజ్జై విలవిల్లాడుతూన్న సంస్కారంలా, మానవత్వపు ముఖమ్మీద పోసిన బురదలా, స్త్రీజాతి పాపెటపై పెట్టిన గొడ్డలిపెట్టులా అమానుషతకు ఎత్తిన జెండాలా, చూచేవారిని వెక్కిరిస్తూ, వారి మనస్సులను పిండుతూ ఏ భావానికి అందరాని విచిత్ర స్థితిలో ముంచేస్తూ వుంది. ఇలాంటి అయోమయ స్థితిలో మున్గుతూ తేల్తూ వున్న మాకు ఏ సవ్వడీ లేకుండా రెండు మూడు నిమిషాలు గడిచాయి.

తాము వెంటాడుతున్న వేట మా ఇల్లు చొచ్చినట్లు పసిగట్టిన వేటకుక్కలు మెల్లగా జారుకుంటున్నట్లు పరుగుల సవ్వడి వినిపించింది.

ఆ ధ్వనితో యింతవరకూ కదలికలేక లక్కబొమ్మల్లా ఉండిపోయిన మాలో, తొలుతగా మేల్కొన్న మావారు, తన షర్టు విప్పి ఆమె పైకి విసిరి, తాను ఇంట్లోకి దారి తీస్తూ నడిచారు.

చేష్టలు మాని చూస్తున్న ఆమె చుట్టూ ఆ షర్టును తుండు గుడ్డలా చుట్టి లోపలికి నడిపించుకొచ్చాను.

అప్పటికే అర్ధరాత్రి దాటింది. మానసికంగా నేను కూడా బాగా అలసిపోయాను. ఇంట్లోకి వెళ్లి ఆమెకు కట్టుకోవడానికి వో పాతచీర ఇచ్చి ' ఈ రాత్రికి పడుకో! తెల్లవారి అన్ని విషయాలూ చెప్పుదువుగాని, ఇప్పుడేం ఇబ్బందిలేదు' అంటూ చెప్పి నేను నా గదిలోకి వెళ్లిపోయాను.

తెల్లవారింది. మేం కొంచెం ఆలస్యంగానే లేచాం. లేచి, పక్కగది వైపు చూస్తే ఆమె లేదు. ఏదైనా అవసరంకోసం వెళ్లిందేమో? అంటూ, అటూ, ఇటూ, చూచాను ఎక్కడా ఆమె జాడ కనిపించలేదు. నేను దెబ్బ తిన్నట్లు గట్టిగా.

'ఏవండీ! నిన్నరాత్రి వచ్చిన ఆ మనిషి గదిలో కనిపించడం లేదం' టూ కేకవేశాను.

ఆయన నా మాట విని ఏ సంచలనమూ లేకుండా, నింపాదిగా, తుండు గుడ్డతో ముఖం తుడ్చుకుంటూ వో మాదిరి వెటకారాన్ని ధ్వనిస్తూ, ఆఁ ఏమైవుంటుంది? మరో మంచి గిరాకీని కుదుర్చుకోటానికి బేరసారానికో, కాక మరో వేటకోసమో వెళ్లుంటుంది. ఎంతటి ఘటికురాలు కాకపోతే ఆ అపరాత్రి... ఇంకా నయం. నీవున్నావు కాబట్టి సరిపోయింది. లేకపోతే? అంటూ సగంలోనే నన్ను చూస్తూ ఆగిపోయారు.

మావారి ఈ చివరిమాట నాగుండెలో అంటే నాలోని స్త్రీత్వాన్ని ఎక్కడో కలుక్కుమంటూ పొడిచినట్లైంది.

మా వారేనా? ఇలా మాట్లాడుతున్నది?

స్త్రీ అనాథగా, అనావరణగా ఉంటే ప్రతి వాడికీ లోకువే! అందరికీ చులకనే. పైగా ఆమె యౌవ్వనంలో ఉండి రూపసి ఐతే మరీ ప్రమాదం. ఆమె ఆకర్షణ మగవాడి అంతరాంతరాళాల్లో దాగివున్న పుంస్త్వాన్ని రగిల్చి కోరికలకు నోరూరిస్తూ, పాశవిక ప్రవృత్తికి గిలిగింతలు పెడ్తుంది. ఆ సందర్భంలో మగవాడెంతవాడైనా సరే. తొట్రుపాటు తప్పదు. కానీ సంస్కార బలం, సాంఘిక కట్టుబాట్లు కొంతవరకు ఆ పతనం నుండి ఆపగలుగుతాయి అంతేకాని, అంటూ చెప్పుకుపోతున్నారు.

అప్పుడనుకున్నాను. నేను, 'స్త్రీ' పురుషుడికి తల్లిగా పరమపూజ్యురాలు. కానీ కేవలం 'స్త్రీ'గా ఆకర్షక పదార్థం. భోగ్యవస్తువు, ఆమె ఆకర్షణకు లొంగిపోవటం పురుషుడి బలహీనత. ఆ లౌల్యాన్ని దాచుకునే ప్రయత్నంలో తనను తాను రక్షించుకునేందుకు, అన్ని వికారాలకూ ప్రబల కారణం స్త్రీ అంటూ ఆమె మీద కసితో నిందలు మోపుతూ ఆంక్షలు విధిస్తాడు.

ఎంతో సంస్కారం వున్నవారు నా భర్త అంటూ గర్వించే మావారు కూడా? ఏమో? అనుకుని మావారి వుపన్యాస ధోరణికి అడ్డువస్తూ ' ఏవండీ! ఆ అమ్మయి ఆ స్థితిలో మన ఇంట్లోంచి వెళ్లి ఎక్కడికి పోతుంది? ఏ నుయ్యో , గొయ్యో, చూచుకుందో? కాక, మరే రౌడీ మూక చేతుల్లోనో చిక్కి ఏం యాతన పడ్తుందో, అన్నాను ఆత్రంగా.

నా మాటతో రెచ్చిపోతూ 'అవును, నీవన్నట్లే ఎక్కడో పడిచచ్చిందే అనుకో, లేదా మరో ఆకలి పులి కామానికి భోజనంగా మారిందే అనుకో అప్పుడు నన్నేం చేయమంటావ్? అతిగా ఆలోచించి నీ మెదడు పాడుచేసుకుంటూ నా టైం వృధా చేయకు. ఇంతవరకైంది చాలు' అంటూ మారుమాటకు తావివ్వకుండా చరచరా నడిచి వెళ్లిపోయారు.

వారెన్ని చెప్పినా నా మనసు మాత్రం ఆ అమ్మాయి నుండి మరల్చుకోలేక ఆమె ఎవరు? ఎలా వచ్చింది? ఎక్కడికి వెళ్లింది? అంటూ ఆలోచిస్తూ వుంది.

ఏదో వింతస్ఫూర్తి కలిగి వెంటనే తర్క-వితర్కం మాని, ఇంటి పనులు పనిపిల్లకు పురమాయించి ఇంటి వెనకవైపు నడకసాగించాను.

మా ఇంటి వెనక ఆవరణ చాల పెద్దది. తుమ్మా, రేగు, కుంకుడు, చింతలు స్వేచ్ఛగా పెరిగిన చోట గడ్డిగాదం. ముళ్లకంపలతో వో పెద్ద కంచెలా వుంటుంది. అక్కడ సామాన్యంగా జనసంచారం వుండదు. ఈ కంచెను ఆనుకుని వో బావికూడా వుంది. అదెప్పుడూ గర్భిణీస్త్రీలా నిండుగా వుంటుంది. ఆ గట్టు పక్కనే వో నాగరాజు ఎన్నో అంతస్థుల భవనంలాంటి పుట్టకట్టుకుని ఎన్నేళ్ల బట్టో కాపురముంటున్నాడు. దైవికంగా పరుగులాంటి నడకతో నేనక్కడికి వెళ్లేవరకు, చీరను కాశెగా పోసి, బావిలో దూకడానికి సిద్ధంగా వున్న వో స్త్రీ కనిపించింది.

అది చూచిన నేను నెమ్మదిగా వెనకవైపు నుండి వెళ్లి, రెండు చేతులూ ఆమె నడుం బిగించి లాగాను. ఆఫోర్స్‌కి ఒకళ్లమీద ఒకళ్లం పడ్డాం లేచి కూర్చున్నాం. శారదా! ఎంతకాలం ఈ దిష్టిబొమ్మను చావకుండా ఆపుతావ్? అంది ఆ స్త్రీ, ఆ మాటతో చకితనై లేస్తూ ఆమె ముఖాన్ని తేరిపార చూస్తూ -

'నీకు నేనెలా తెలుసు? అంటూ ప్రశ్నిస్తూనే ఏదో పోలిక స్మృతిలో మెదుల్తూ వుంచే. ఆఁ నీవు పార్వతమ్మ కూతురు అనసూయవా'? అన్నాను. ఆమె ఆ మాట విని రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకుంటూ 'అవును, అనసూయనే! స్కూళ్లో నీకు వో సంవత్సరం జూనియర్ని. టెంతులో ఫస్టుని. బరిబత్తల బొమ్మని. యింకా బతికివుంటే రేపు కాబోయే ఎంగిలివిస్తరినీ. అంగడిబొమ్మని' అంటూ నా మీద వాలి భోరున ఏడ్చేసింది.

ఆమెను ఏడ్వకు అంటూ వోదారుస్తూ ఈ దారుణం ఎట్లా జరిగిందో చెప్పమన్నాను.

'శారదా! నా విషాదగాథ ఎలా ప్రారంభించాలో తెలియడం లేదు. అయినా, నేను పార్వతమ్మ కూతుర్నీ. అస్తమానం చుట్ట కాలుస్తూ కళ్లద్దాలు పెట్టే రామారావు మా నాన్న అంటూ తెలుసుగా.

అదేంటి అనూ! నాకు తెలియకేం?

'అయితే విను, ఆ రామారావు నన్ను కన్న తండ్రికాదు'

మరి నాన్నా! అంటుండే దానివిగా? మీ అమ్మగారు కూడా భర్తగానే గౌరవించేవారు? ఆ మాట నిజమే! అయినా వాడు నా తండ్రికాదు. అలంకారంలా నా జీవితంలో అంటే మా అమ్మ జీవితంలో ప్రవేశించి, అదను చూచి నన్నీ అధోగతి పాలు చేసింది ఆ నీచుడే' అంది.

'అంటే? నాకేం అర్థం కావటంలేదు అనసూయా!' అన్నాను.

మా అమ్మ మంచి సంప్రదాయమైన కుటుంబంలో పుట్టిందే. అయితే కాలగతికి అడ్డమేముంది? అన్ని పాపాల్లో పేదరికం వంటి శాపం మరోటి లేదు. అంటే విధి వక్రించిన మా తాత మా అమ్మను వోలితీసుకుని పూర్తి వయసు పడమట తిరిగిన మూడో పెళ్లివాడికి ముడికట్టాడు.

పాపం! వృద్ధుడైన ఆ హనుమంతరాయుడికి కావలసింది భార్యకాదు. తన బాగోగులు చూచే పరిచారిక. అంతే! ఎప్పుడో ఏ ముహూర్తంలో, ఏ ఒకటి రెండుసార్లు తాకాడోలేదో అమ్మకు నేను పుట్టాను. నాయన మంచం పట్టారు.

వికసించే వయస్సుతో వివాహితకు కోరికలు మోసులెత్తుతాయి. కానీ వాటిని ఆదరిస్తూ దోహదం చేసే శారీరక సుఖం మా అమ్మకు లభించలేదు. అయినా ఆమెకు ఏం కావాలో? తెలియక, ఇంటి చాకిర్లో, మగని సేవలో మునిగి ఏదో హాయిగానే వుంటుండేది.

అప్పుడు మా వూరికి ఇంగ్లీషు మందులిచ్చే కొత్త డాక్టరంటూ ఈ రామారావు మా ఇల్లు తొక్కాడు. విసుక్కోకుండా పొద్దస్తమానం భర్తకు అన్ని సేవలు చేస్తూ వున్న మణిశలాకలాంటి మా అమ్మ కంటపడ్డది.

మా అమ్మమీది ఆకర్షణతో మా నాన్న మీద సానుభూతి వైద్యుడికి ఎక్కువైంది. పిలిచిందే పదివేలంటూ రోగిని చూచే నెపంతో ఒకటికి పదిసార్లు ఇంటికి వస్తూ రంగు రంగుల నీళ్లు మందు రూపంలో ఇస్తూ అవకాశాన్ని కల్పించుకుని, సందు దొరికినప్పుడల్లా ప్రయత్నపూర్వకంగా, యౌవ్వనం ఝల్లుమనేలా అమ్మను తాకుతూ అందరికి దగ్గరి వాడయ్యాడు.

ఇంతకింతకు మా నాన్న మృత్యు ముఖానికి చేరువయ్యాడు. పడుచుపెళ్లామని కాబోలు, నాన్న ప్రాణాలు యమయాతన పడ్తున్నా గొంతులో గుటగుటమంటూ తారట్లాడుతున్నాయే కానీ విడిచిపోవటంలేదు.

ఓ రోజు మా నాన్న కాస్త నిద్రపోతున్నట్లుంటే వొంటరిగా వసారాలో కూర్చుని అమ్మ విచారంగా ఆలోచిస్తూ వుంటే ఈ రామారావొచ్చి 'చూడండి పార్వతమ్మగారూ! మీ మంచిని కోరే స్నేహితుడిగా మీకో మాట చెబుదామనుకుంటున్నాను. మీ భర్తనేడో రేపో అంతే! కాబట్టి కాటికి కాళ్లు చాచిన ముసలికిచ్చి ఇంత వరకే మీ కోరికల గొంతు నులిమారు. మీరు మరీ అణగదొక్కకండి. చేజేతులా అందివచ్చిన ఆ అదృష్టాన్ని జారవిడుచుకోకండి. అవివేకంతో అవకాశాన్ని పోగొట్టుకుని వెన్నెల్లా వెలుగ వలసిన జీవితాన్ని చీకటిమయం చేసుకోకండి. ఆత్మకూ, ఇంద్రియాలకూ తృప్తినివ్వని కాపురం కేవలం దాస్యం. అంతకన్నా నరకం మరోటి వుండదు. ప్రత్యక్షంగా మీరనుభవిస్తున్న నరకాన్ని చూస్తున్నవాడిని కాబట్టి చెబుతున్నాను. నామాట వినండి. మిమ్మల్ని అన్యాయం చేయను. నన్ను నమ్మి నా వెంట వచ్చేయండి. నాకింకా పెళ్లికాలేదు. మిమ్మల్ని భార్యగా స్వీకరిస్తాను వొట్టు' అన్నాడు.

'నేనంత తెగింపు చేయలేనండి. పాపం! రోగిష్టి మనిషి. చేసే దిక్కులేదు పైగా నా బిడ్డకు తండ్రి. అలాంటి వ్యక్తిని కష్టసమయంలో వదిలి మీతో లేచిపోయి ఎలా వచ్చేది?' అన్నది పార్వతమ్మ.

'అయ్యో! పిచ్చిదానా. రేపోమాపో. ఆ జీర్ణించిన శరీరంలో ప్రాణం హరీమంటుంది. అప్పుడు చుట్టుపక్కాలు రావటం. కర్మకాండ జరపడం. నీతలమాయడం. తతంగం అంతా వుంటుంది. విధవగా, కళావిహీనమై, కృశించి దీనంగా వున్న నిన్ను నా భార్యగా ఎలా స్వీకరిస్తాను? అందుకే. ఆయనతో ఏ సంబంధం లేనట్లు. నా ప్రియురాలిగా రంభలా వొయ్యారాలొలుకుతూ ఇప్పుడే నా వెంటవచ్చెయ్. మనిద్దరం ఈ వూరు విడిచి రేపురాత్రే బయలుదేరి వెళ్లుదాం. ఏమంటావ్?' అన్నాడు.

పాపం పార్వతమ్మ. తెలిసీ తెలియనితనంతో,కోరికల ప్రేరణతో ఎండమావులను తన దప్పిని తీర్చే తీర్థం అంటూ నమ్మి ఇంట్లో చుట్టాలు ఒక్కొక్కరే సందడిగా చేరుకుంటున్న అదును చూచి, తెగించి బయటపడింది.

'మరి నీవేమయ్యావ్ అనూ?!

'నేనేం కాలేదు. నాతో కూడా పార్వతమ్మ ఆ కొత్త మొగుడి వెంట రాత్రికి రాత్రే బయలుదేరింది.

'ఐ.సి.' తన కాంక్ష తీర్చుకున్న రామారావు మీ అమ్మను వదిలెయ్యలేదుగా?

'లేదు శారదా! లేదు. కానీ మా అమ్మ సజీవదహనాన్ని అనుభవిస్తూ గుట్టుగా బ్రతికింది.

లేచివచ్చి దండలు మార్చుకున్న తొలిరోజుల్లో కొన్నాళ్లు రామారావు వేడికౌగిట్లో ఆ బలమైన చేతుల్లో ఆమె యౌవ్వనం, హోయిహోయి అని సుఖిస్తూ వుంటె ఇంతవరకు తనకు తెలియని సుఖాలన్నీ తన పాదాల ముందు హారతులెత్తిన ప్రేమికుడుగా కనిపించాడు రామారావు.

'అయ్యయ్యో! రామారావుగారి మాట వినకుంటే జీవితంలో ఎన్నో పోగొట్టుకునేదాన్ని, ఇతరమైన ఏ సౌకర్యాలు సుఖాలు లేకపోయినాసరే! ఈడూ జోడూ కలిసినవాడు, తోడుగా ఆత్మీయంగా వుంటే స్వర్గసుఖాన్ని అనుభవించవచ్చు' అనే తృప్తితో మా అమ్మ రామారావుతో జీవించింది.

'అనసూయా! మీ కొత్త నాన్న మంచివాడేగా?

'శారదా! వాడు వ్యసని, దురాచారి, విషయలంపటుడు. డబ్బుకోసం ఏ గడ్డైనా తినడానికి సిద్ధపడే పాపి. నా పతనానికి ప్రధాన కారణం. పడుపు కూటికి ఆశించే కుక్క

కొత్త మోజులో రంభలా కనిపించిన మా అమ్మ అందం విలువ రానురాను తగ్గుతూ వచ్చింది. పైగా తనకేమి కాని నేను ఆయన కంట్లో నలుసుగా తయారయ్యాను. ప్రతి చిన్న విషయానికి నన్ను కఠినంగా శిక్షిస్తూ. తండ్రిగా నా బాగోగులు బాధ్యతలేవీ పట్టించుకోకపోయినా ఆయన్నేమీ అనేది కాదు నా తల్లి. నేను అదీ. ఇదీ. అంటూ మారాం చేస్తే 'నీ బతుక్కి అదొక్కటే తక్కువ. వూర్కో నాన్నను వేదించకు' అంటూ నన్ను కసురుకునేది.

'అంటే నీకు ఈరామారావు సొంత తండ్రి కాదంటూ తెలియదన్న మాట'!

'అవును తెలియదు. మా అమ్మ తెలియనివ్వలేదు. పుట్టెడు వ్యధను కడుపులో .దాచుకుని, గుంభనంగా, జారిన కాలు మరీ జారీ విరిగి వికృతం కాకుండా కాపాడుకుంటూ వచ్చింది. తాను మోపిన కాలు బురద అంటూ గ్రహించినా, తీసుకునే మార్గం లేక పరిస్థితులతో సమాధానపడ్తూ వాడినే మనసా వాచా భర్తగా సేవించింది.

'మరి, నీకెలా తెలిసింది? ఈ రామారావు మీ సొంత నాన్న కాడంటూ?'.

'శారదా! విను, నేను ఎదిగే కొద్దీ రామారావు కుళ్లు బుద్ధికి ఏం తోచిందో? కానీ వాడి దృష్టిలో, ప్రవర్తనలో మార్పు తొంగి చూసింది. నా ఆరోగ్యం, పోషణా పాలనలపట్ల శ్రద్ధ ఏర్పడింది. అన్నిటా వోడిపోయిన మా అమ్మ మంచం పట్టింది. బాగా బలిసిన గొర్రె పిల్లకు బజారులో మంచి ధరను గూర్చి ఆలోచిస్తూ మురిసిపోయే గొల్లవాడి కంటికి మెరుపులా ఎదుగుతున్న నా వయస్సూ, సొగసూ రామారావు కళ్లల్లో కొత్తకాంతులను నింపాయి. ఆ తళుక్కు చూచి, దగాపడ్డ మా అమ్మగుండె వూర్కోనివ్వలేదు'.

'అంటే? మీ అమ్మ ఏం చేసింది?'

ఏం చేస్తుంది? ఏం చేయలేదు. కానీ నన్ను పిలిచి, ఇన్నాళ్లూ బయటికి పొక్కే మార్గంలేక కళ్లల్లో సుళ్లు తిరిగి కరడుకట్టిన కన్నీళ్లన్నీ వరదలు కట్టేలా ఏడుస్తూ తన కథంతా చెప్పింది. చివరకు మీ నాన్న కాని నాన్నతో జాగ్రత్త! అంటూ హెచ్చరించింది. ఈ నాజన్మరహస్యం తెలిసినప్పటి నుంచీ, నాలో శాంతి నశించింది. ఇంతవరకూ మా అమ్మ అంటే సహనానికి పెట్టింది పేరూ. ఆమె మహాసాధ్వి, అంటూ చిత్రించుకున్న బొమ్మకు మసి తాకింది. ఏవగింపు చోటు చేసుకుంది. నా లేతమనస్సు నా కన్న తండ్రిని గూర్చీ మా అమ్మ చేసిన తప్పొప్పులను గూర్చి ఆలోచించడం ప్రారంభించింది.

నాలో పెరుగుతున్న ఘర్షణనూ, ముభావాన్నీ పసిగట్టిన మా అమ్మ మరింత క్రుంగి పోసాగింది. నన్ను రామారావు అప్యాయంగా చూట్టం మొదలెట్టాడు. వోనాడు నేను నాన్నా! అంటూ పిలిచే ఆ పశువు చిత్తుగా తాగి వున్నాడు. ఎవరో యిద్దరు అపరిచితుల్తో హుషారుగా మాట్లాడుతున్నాడు.

'సార్! ఈ రోజా రేపు బంగళాలో బసచేసిన మృగానికి వో మంచి వేట కావలసి వచ్చింది' అన్నాడు.

'కాసులు వెదజల్లితే లేళ్లకు కొదువలేందే?' అంటూ సకిలించాడు రామారావు.

'అది కాదుసార్. ఏదో? కొత్తపిట్ట ఐతే మంచిదంటూ మనస్సు పడ్తున్నాడు'.

'కొక్కపిట్టేం ఖర్మ. బుర్కలు, నెమళ్లు, పావురాలు, సరీబరిపోరు సల్పే ఆడడేగలు. పట్టబోతే పదిగిచ్చులు గిల్లే ఫిరంగిపిట్టలు, నీటి బాతులు. యింకా గూటి నీడ వదలని గువ్వలు ఎన్ని దొరకవు? రాగిపైన దులిపితే రాజు బిడ్డరాలుతుంది' అంటూ లోతుపాతుల ముడివిప్పాడు.

'ఈనాడు ఏదో అకాలం పడి కరువు దాపురించినట్లు దొమ్మరి గుడిసెల నుండి ఘరానా బుకింగ్స్ వరకు హౌస్‌ఫుల్‌గా వుంది. ఆ జంతువేవైనా పస్తులుపడి అలమటించిపోతూంది. మీదే భారం' అంటూ సాగుతుంది సంభాషణ.

ఆ మాటల్లోని అర్థం తుదీ, మొదలూ ఏదీ గ్రహించలేక, ఏదో వూరి మీది ముచ్చటై వుంటుంది. నాకెందుకు? అంటూ నా పనిలో పడిపోయాను. సాయంకాలమైంది. మామూలుగా తల దువ్వుకుని, వున్నదాంట్లో కాస్త చిరగని చీరకట్టుకుని రోజూ నేను చెప్పే ట్యూషన్ కంటూ బయలుదేరాను. అలా వెళ్తున్న నన్నాపుతూ రామారావు -

'అనసూయా! నీవు ట్యూషన్ చేసుకుని వస్తూ వస్తూ ఈ మందు పొట్లాలు వూరి అవతలి గెస్ట్ హౌస్ పక్కని బంగళాలో వున్న పెద్ద మనిషి కందచేయాలి. నేనే వెళ్లుందును కానీ మందు కాస్త ఎక్కువైంది. పెద్దవాళ్ల ముందు అలా వెళ్లితే డాక్టరుగా నా పరువు దక్కదు. వచ్చే రెండు రాళ్లూ రావు. మన సంసారంకోసం నీవు తప్పకుండా వెళ్లి ఈ చీటీలు ఆయనకు చేర్చిరావాలి. డబ్బిస్తే పట్టుకురా! ఆ... అన్నట్టు ఈ చీర మరీ పాతదిగా వుంది. మరోటి మార్చుకో! అంటూ ఎంతో సహజంగా చెప్పాడు.

ఆ మాటల్లో నాకే కొత్తకానీ, అసహజమైన విశేషం కానీ మోసం కానీ కనిపించలేదు. నిజమే! వో పెద్ద మనిషి ఎదురుగా వో డాక్టరు బిడ్డగా మరీ పాతగుడ్డల్తో వెళ్తే ఏం బావుంటుంది? 'ఈ మనిషిలో కూడా కాస్త సభ్యతా రుచి యింకా మిగిలే వుంది' అని అనుకుంటూ ఆలస్యం చేయకుండా వో ఇస్త్రీ చీరకట్టుకుని బయలు దేరాను.

నేను నా ట్యూషన్ పని ముగించుకుని 'చీకటి పడబోతూంది. ఆ వూరవతలి బంగళాకెళ్లాలి. యీ మందు లా పెద్దమనిషికివ్వాలి' అంటూ గబగబా నడిచి బంగళా చేరుకున్నాను.

గేటుదగ్గర ఎవరో కాపలా వున్నారు. లోపల ఆఫీసరుగారున్నారా? డాక్టరు రామారావుగారు మందులు పంపించారు. నేను ఆయన కూతుర్ని అన్నాను. ఆ కాపలా మనిషి లోపలికి వెళ్లి వెంటనే తిరిగివచ్చి లోపలికి రమ్మంటున్నారు. వెళ్లొచ్చు. అంటూ నన్నదోలా అపాదమస్తకం పరికించాడు.

గబాగబా లోపలికి వెళ్లి వో సిటింగ్ రూం లాంటి దాని ముందు ఆగిపోయాను. ఎవ్వరూ కనిపించలేదు. అది ఇల్లో? గెస్ట్ హౌసో? నాకేం అర్థ కావటంలేదు. పిలవటానికి పేరు తెలియదు. ఏం చేయాలంటూ తటపటాయిస్తూ వుంటే మధ్యవయస్సులో వున్న వో వ్యక్తి అత్తరు వాసనల గుభాళింపులతో ప్రత్యక్షమయ్యాడు.

నన్ను చూడగానే ' ఓ వాటే బ్యూటీ, కమ్ హియర్. ఐ యాం వెయిటింగ్ ఫర్ యూ' అంటూ రెండు చేతులూ చాచాడు.

నేను మరింత బిత్తరపోతూ 'నన్ను డాక్టరు రామారావుగారు పంపారండి. వారమ్మాయిని నేను. మీకీ మందులు ఇచ్చి రమ్మన్నారు అంటూ మందుల పొట్లం అందించాను నమస్కరిస్తూ.

'వెరీ గుడ్, వెరిగుడ్, నిన్ను ఎక్స్‌పెక్ట్ చేస్తూనే వున్నాను. ఎలా యింత దూరం వచ్చావుగా. కాఫీ తీసుకు వెళ్లదువు గాని వుండు' అంటూ బలవంతం చేశాడు.

పెద్దాయన అంత ఆప్యాయంగా పిలుస్తుంటే మరీ పల్లెటూరి గబ్బిలంలా భేషజం చూపడం బాగుండదనుకుంటూ ఆ గది దాటి లోపలికి వెళ్లి కూర్చున్నాను. చూస్తున్న కొద్దీ ఆ గది వాతావరణం డ్రాయింగ్‌రూంలా లేదు. బెడ్ రూంలా వుంది. టి.వీ ఆన్‌చేసి ఆ వ్యక్తి లోపలికి వెళ్లి పోయాడు. టీ మాత్రం రాలేదు. ఓ అరగంట తర్వాత డ్రస్ మార్చి లాల్చీ లుంగీతో వచ్చి కూర్చున్నాడు. నాకెందుకో గుండె వేగంగా కొట్టుకూంటుంది. ఆ వ్యక్తి వింత వింత వికృతపు చూపులతో నన్ను మింగేసేలా చూస్తున్నాడు. ఎంత ఆదరంగా వున్నా? ఈ చూపులేంటి? అవి నా శరీరాన్ని తాకిన చోటల్లా జెర్రులు, నల్లులు పాకినట్లుంది. పోనీ నా దృష్టిని మళ్లించుకుని గోడలవైపు చూస్తే అశ్లీలకరమైన చిత్రాలున్నాయి. చివరకు తెగించి 'అంకుల్! ఇంట్లో ఆంటీ పిల్లలు ఎవ్వరూ లేరా? మీరొక్కరే వున్నారా? నే వెళ్తాను. బాగా చీకటి పడింది' అంటూ లేవబోయాను.

అంతలోకే వాడు అమాంతం ఎగిరి గంతేసినంత పని చేస్తూ 'ఎక్కడికిపోతావే బుల్ బుల్. నా ఆకలి తీర్చింది' అంటూ నన్ను అదిమి పట్టుకున్నాడు. ప్లీజ్ అంకుల్ నన్నొదలండి. ఆలస్యం చేస్తే నాన్న కోప్పడతాడు.

'ఎవడే నాన్న? ఆ తార్పుడుగాడా? నీకింక ఏ భయమూ లేదు. నీవు యింక యీ ప్యార్‌మహల్‌కు మహరాణివి. వాడెంత డబ్బులాగాడని? అసలు బేరం మీ అమ్మతోనే

కుదుర్చుకున్నాడు. దానికేదో జబ్బు చేసిందని నిన్ను పంపాడు. వాటే జాక్‌పాట్ ఐ గాట్. మీ అమ్మ సొగసులాడి అంటూ విన్నాను. అయితే ఆ భల్లూకం చేతుల్లో నలిగి నలిగి కరిగిపోక ఇంకా ఏం మిగిలి వుంటుందని? ఆపిల్ పండులా నీవు దొరికావు. డార్లింగ్! మరీ పసిపిల్లలా వున్నావు. లవ్ గేమ్ తెలియకపోయినా కిస్ కూడా తెలియదా? అంటూ అడవి దున్నలా నన్నాక్రమించి నా పెదవులను ముఖాన్ని ఎంగిలి చేస్తున్నాడు. నాకు దుఃఖం ఆగడం లేదు. చస్తే బాగుండుననిపిస్తోంది. అరుస్తున్నాను, గింజుకుంటున్నాను. మధ్యమధ్యలో ఎలకతో చెలగాటలాడే పిల్లిలా నన్ను వదిలి లోపలికి వెళ్లి తినడానికి తీసుకువస్తున్నాడు. నేను కలలో కూడా చూడని కమ్మటి షర్బత్ పోసి తాగమంటున్నాడు.

నేను దీనాతి దీనంగా చేతులు జోడిస్తూ వాడి ముందు మోకరిల్లి నన్ను వదలండి. నేను మీకు బిడ్డలాంటిదాన్ని. నన్నేమి చేయకండి. అంటూ ప్రాధేయపడ్డాను.

ఆ మృగం కొంత శాంతించినట్లు నన్ను లేపి పక్కమీద కూర్చోబెట్టుకుని నా వీపు నిమురుతూ, 'నీవు చలం సాహిత్యం చదవలేదా? ఆడపిల్లలు ఈ కట్టుబాట్లు తెంచుకుని ప్రగతి శీల మార్గంలో నడవాలి. దీసీజ్ ఆల్ గివ్ అండ్ టేక్. నా అవసరం నీవు తీరిస్తే నీ ఆర్థిక యిబ్బంది నేను తీరుస్తాను. సెక్స్ ఈజ్ యూనివర్సల్ అండ్ బేసిక్ నీడ్. అరుణ చూడు! ఎంత సమర్థవంతంగా అందరి మగవాళ్లను ఆకట్టుకుందో?' అంటూ తన లిటరరి టేస్ట్‌ను ప్రదర్శించబోయాడు వెధవ. రెండు కాళ్ల దున్న.

మన వారు చెప్పేది నిజమే. మన సాహిత్యం నీతిని ప్రత్యక్షంగా ప్రచారం చేయకపోయినా అవినీతికి దారిచూపే విధానాన్ని మాత్రం పరిహరించాలి అని. మిడిమిడి జ్ఞానం వున్నవారికి ఇలాంటి ప్రవచనాలు విషముష్టి గింజల్లా ప్రమాదాన్ని తెచ్చిపెడ్తాయి. చదివించే కమ్మటి భాషలో సెక్స్ గుమ్మరిస్తే వేలం వెర్రిగా రుచి మరిగి యువత, ఆం యువత ఒక్కటేనా? అంతా ఆ దారే తొక్కుతుంది.

'సరే మరి వాడి నోటికి తాళమెలా వేశావు?'

'నేను తాళం వేయడ మేమిటి శారదా? వాడే నన్ను ఇంతింత నరకకూపంలోకి తోసుకుపోయాడు.

మోకరిల్లిన నేను లేవబోతూ వుంటే వాడు ఏదో యంత్రంలా నన్ను వాడి పైకి లాక్కున్నాడు. మైనపుబొమ్మలా వాడి ఎదపైకి వాలిపోయాను. ఆనందంతో వాడు నవ్వుతున్నాడు. 'వండర్‌ఫుల్. వాట్ ఎ ప్లెజర్' అంటూ నన్ను అదుముకున్నాడు. నా శరీరం భగ్గుభగ్గున మండుతుంది. బలాన్నంతా కూడదీసుకుంటూ నన్ను చుట్టుకున్న వాడి చేతిని కొరికి పట్టు విడిపించుకున్నాను. నొప్పితో వాడు బాధపడుతుంటే చేజిక్కిన అవకాశాన్ని జారనివ్వకుండా లేచి మంచం దిగి పరుగందుకున్నాను.

ఇంతలో తేరుకున్న ఆ పసరం ఎదగొన్న కారుదున్నలా, దెబ్బతిన్న పందిలా నా

వెనకవైపు తాకి వెంట్రుకలు ఒడిసి పట్టి పండ్లతో కుక్కలా నా బ్లౌజు చించి బెడ్‌పై పడేసి నన్ను పూర్తిగా వివస్త్రను చేశాడు. వాడు అసహ్యంగా బట్టలన్నీ విప్పి నాపై పడి గిచ్చుతూ, కొరుకుతూ రాక్షసానందాన్ని అనుభవిస్తున్నాడు.

గదిలో గడియారం రాత్రి పదకొండు గంటలు కొట్టింది.

నా అదృష్టం నడిచి వచ్చినట్టుగా గేటుతీసిన శబ్దం అయ్యింది. ఆ వెంటనే ఓ స్త్రీ కంఠం 'ఏవండి తలుపు తలుపు' అంటూ కేకలు పెడుతుంది.

నాపై వాలి రేచికలా నా రక్తాన్ని, నా లజ్జని, నా స్త్రీత్వాన్ని, నా సర్వస్వాన్ని చప్పరిస్తూ ఎంగిలి కూటిలా అపవిత్రం చేస్తూ నన్ను మరుక్షణంలో మింగి జీర్ణించుకోవడానికి సిద్ధంగా వున్న ఆ ముదనష్టపు పిశాచి వెంటనే లేస్తూ తన గుడ్డలు సవరించుకుని దీపాలు ఆర్పి పాపపు బోను లాంటి వాడి గది వెనుకవైపు మార్గం నుండి నన్ను అవతలకు తోసేసి తలుపులు బిగించుకున్నాడు.

ఇంతైనాక ఇంకా నాలో కన్యాత్వం, శీలం మిగిలిందో లేదో? చెప్పలేను. కాని జరుగుబోయే ఈ సర్వనాశనం వాలకాన్ని బట్టి చూస్తే? వచ్చింది, ఆ రాక్షసుడి భార్యే అయివుంటుంది అనుకున్నాను. ఆమె మాట వినగానే సింహగర్జన విన్న నక్కలా వాడి సర్వావయవాలు కంపించగా శరీరంలోని నెత్తురంతా నీళ్లై గడ్డ కట్టినట్టు భయంతో లేచాడు' అన్నది అనసూయ.

'అవును అనసూయా! ఆమె భార్యేఅయివుంటుంది. పైగా డబ్బున్న తండ్రి కూతురు కావచ్చు. అన్నిటికి తోడు ఎప్పటినుంచో ఈ పశువు కాముకతా, లౌల్యం బాగా తెలిసి విరక్తితో పగబట్టి వుంటుంది. తనకు దక్కవలసిన సుఖం మరెవ్వరికో పంచుతూ తన డబ్బుతో కులుకుతున్నాడంటూ అడుగడుగునా అవమాన పరిచేందుకు చూస్తూ వుండి వుంటుంది. చేతికి దొదరికినప్పుడు రెడ్ హేండెడ్‌గా పట్టుకుంటానంటూ ఎరవేసి వుండింది.

ఈ చౌకబారు పశువు ఆమె కన్ను గప్పి జల్సాలకు దిగుతుంటాడు. ఇద్దరి మధ్యలో ఏ మాత్రం ప్రేమలేదు. ఒకరికి అసహ్యం, కక్ష, మరొకరికి భయం, నిరాదరణ. ఇంట్లో మగవాడికి కానీ, స్త్రీకి కానీ ముకుదాడు వేసి ఎంతకాలం నియమించగల్గుతాం? ఏ మాత్రం స్వేచ్ఛా స్వాతంత్ర్యం లేని బ్రతుకు, బ్రతుగ్గా వుండదు. నిజమే! ఇచ్చిన స్వేచ్ఛను నిరుపయోగం చేసుకోవడం కూడా మంచిదికాదు. సంసారంలో భార్యాభర్తల మధ్య నమ్మకం వుండాలి. అదిలేని కాపురం పోలీస్ డ్యూటీ రూంలా వుంటుందే తప్ప అరమరికలు లేని ఆనందనిలయంలా వుండదు. అందుకే నమ్మకం విశ్వాసం స్త్రీ పురుషులిద్దరికి అవసరం. సందేహాలకూ అనుమానాలకూ తావిచ్చి కాపురాలు కూల్చుకోవద్దంటాం, కానీ యిలాంటి పశువుల్ని వో కంట కనిపెట్టకపోతే ఎన్నో అనర్థాలు బాహాటంగా జరుగుతాయి. ఏమైతేనేం పుట్టి పూర్తిగా మునగకముందే భార్య వచ్చిందని సమాధానపడ్డా 'అన్నా నన్ను క్షమించు నీకు బాధ కలిగిస్తున్నానేమో? తరువాతేం జరిగిందో చెప్పు' అన్నాను.

ఆమె వికటంగా నవ్వుతూ, ఏం జరుగుతుంది?

'నన్నంత వరకూ అపురూపంగా ఆరాధించినంత పనిచేసి తన భార్య అన్న విషయం రాగానే, నన్ను మాంసం తిన్నాక మిగిలిన ఎముకలా, రసం పీల్చిన మామిడి టెంకలా. నా నగ్నత్వాన్ని గూర్చి కూడా యిసుమంత ఆలోచించకుండా అవతలికి నెట్టాడు. కనీసం మనిషి పుట్టుకకు వుండవలసిన మానవత్వపు లక్షణాలు కూడా లేకుండా ప్రవర్తించిన వాడి నెత్తురు తాగాలనిపించింది. వస్తూ వస్తూ చేతికందిన గుడ్డను చుట్టుకుందామని ప్రయత్నించాను. కుక్కలు ఎగబడ్డూ ఆ గుడ్డను అందుకున్నాయి. భయం కొద్దీ గుడ్డను వాటి నోటికిచ్చి, బరిబత్తల కామినీ పిశాచంలా, శివసత్తిలా, పూనకం వచ్చిన మరిడమ్మలా, ముళ్లూ పొదలూ గీకుతూ నెత్తురొలుకుతున్నా లెక్కచేయక పరుగందుకున్నాను. చీకట్లో పరుగెత్తుతూన్న స్త్రీ ఆకారాన్ని చూచి ఆ వాసనకు ఎగబడి మనుష్యరూపంలో వున్న రెండు వేటకుక్కలు నన్ను చీల్చిచెండాడి నా మాంసాన్ని నమిలి మింగడానికి దాహంతో ఆకలితో సిద్ధంగా నన్ను వెంబడించాయి. అన్నిటికి తెగించి పురుగెత్తుతూ కనిపించిన మీ ఇంటిని రక్షణకోసం ఆశ్రయించాను. అది మీ ఇల్లు అని తెలియదు. తరువాత విషయం నీకు తెలుసు' అంది.

'అవును అనూ! మరి మాకు చెప్పా చెయ్యకుండా ఎందుకిలా వచ్చావ్? కారణం'

'శారదా! ఇంట్లో అడుగు పెట్టగానే నిన్ను పోల్చుకున్నాను. నీవూ, నీ భర్తా, పండంటి పసివాడిని చూచాక నీకూ నాకూ, నాగలోకానికీ నక్కకూ, స్వర్గనరకాలకూ, అమృతానికీ విషానికీ పారిశుద్ధ్యానికి బురదకూ వున్నంత తేడా కనిపించింది. నా జీవితం నాకు పరమనీచమై మరీ అసహ్యంగా పెంటిలో పురుగులా కన్పించింది. ఛీ అనుకున్నాను. ముందు అవతలికి నడిచి ఆలోచించాలి అనుకుని మనస్సులోనే మీ వారికి నమస్కరిస్తూ, ఏ దృష్టి దోషం నీకు తగలవద్దని కోరుకుంటూ బయలుదేరాను. ఈ బావి కనిపించింది.'

'అందులో పడిచస్తాననుకున్నావ్? అంతేనా? పడి ఏం సాధిస్తావ్' అన్నాను.

'శారదా! విను! ప్రతీకారం గూర్చి నేనూ ఆలోచించాను. ప్రతీకారం మాట అలా వుంచి ఈ విషయం తెలిస్తే నన్ను బ్రతుకనిస్తుందా సంఘం? అప్పుడు నేను జీవించాలనుకుంటే వేశ్యనై నా శరీరాన్ని అమ్ముతూ అందరి కొంపలూ కూలుస్తూ హాయిగానే వుండవచ్చు. తొల్త ఆ పిశాచిని సర్వనాశనం చేయాలి అనుకున్నాను. ఛీ! ఛీ! మళ్లీ వాడి స్పర్శను భరించడమా? వద్దనుకున్నాను.

ఇక రెండో మార్గం. ఉగ్రవాదుల్లో చేరి హింసకు దిగి వాడి ఇంటిల్లిపాదిని కూకటి వేళ్లతో పెల్లగిస్తూ బూదిపాలు చేయాలి లేదా? వాడిపై ఎక్కి తుపాకీ మొనతో కొట్టి కొట్టి చిత్రవధ పాల్జేసి చంపుతాను. కీలు కీలు విరుస్తాను. ఆ నోటిలో కణకణలాడే నిప్పు కలుపోసి కాలుస్తాను అనుకున్నాను. కానీ! వాడితో పాటే ఎందరో అమాయకులు చావాలి. నా స్వార్థం

కోసం అందరినీ బలివ్వడం దేనికి? సిద్ధాంతం మంచిదైనా ఆచరణలో అమలులో జరిపే సామూహిక హింస నన్ను కంపింపచేసింది. వద్దనుకున్నాను. మెదడు వేడెక్కుతూ వుంది. ఎవరైనా చూస్తారేమో? కసికి ప్రకోపం తగ్గగానే పిరికితనం ఆవరించింది. ఏమైతేనేం చచ్చిపోవటమే సర్వోత్తమం. ఎవరూ రాకపూర్వమే ఈ బావిలో పడ్దాననుకున్నాను. నీ వొళ్లో పడ్డాను' అంటూ ముగించింది.

అనసూయా! నా మాట విను. నీవు చావవలసిన పనిలేదు. నీ పగ తీర్చుకుందుకు మరో మార్గం వుంది. పగంటూ సాధించాలి అంటే ఎవరనేది తేల్చుకో! మొదట మీ అమ్మను కాటికి కాళ్లు చాచిన ముసలికిచ్చిన మీ తాతదోషా? పదహారేళ్ల పసిదాన్ని వాంఛలుడిగిన మీనాన్న పెళ్లి చేసుకోవడం దోషమా? మీ అమ్మను నమ్మించి ఆమెకు అన్యాయం తలపెట్టిన ఆ నీచుడు దోషా? నిన్ను తార్చిన దుర్మార్గులా? నిన్ను ఆటబొమ్మకన్నా నికృష్టంగా ఆడుకోదలచిన కాముకుడా? సంఘమా? పేదరికమా? తెలియనితనమా? మన అంధవిశ్వాసాలా? గొర్రెదాటుతనమా. అన్యాయాన్ని ఎదిరించే శక్తిలేని బిడియమా? బెదురా? ఏది?

నా దృష్టిలో అన్నీ అంటాను. ఏదో వో ఛిద్రం ఏర్పడితే పురుగు చొచ్చి తొల్చినట్లు అనావరణగా నిస్సహాయంగా స్త్రీ వున్నంతకాలం సంఘం వొక్కటై పిచ్చి కుక్కను తరిమినట్టు తరుముతుంది స్త్రీని.

బలాన్ని పుంజుకో! నిద్రాణమైన నీ శక్తులను జాగృతం చేయి. నీకే భయమూ లేదు. అవమానపడవలసింది నీవు కాదు. నిన్నా స్థితిలో చూచిన సంఘం తల దించుకోవాలి. ఆ ఇద్దరు దుర్మార్గులను శిక్షించాలి. ప్రస్తుతానికి నీ శీలం ఎక్కడికీ పోలేదు. రా! పోదాం ఇంట్లోకి నడువు. నీవు పై చదువులు చదవడానికి సిద్ధపడు. దీక్షగా వుండు. నీకు తెలియదు. మా సఖ్య సమాఖ్య వుంది. భావనా సాహితి వుంది. తదితర స్త్రీ వాద, సంక్షేమ సంఘ సభ్యులున్నారు. వాళ్లంతా సంఘటితమై ఆ దుర్మార్గుడిని మూడు చెరువుల నీళ్లు తాగించి నీ కాళ్లపై పడవేస్తారు. ఇప్పటికి శాంతించు అన్నాను.

పాము తోకపూపుకుంటూ పుట్టలోకి వెళ్లిపోయింది. మేం యింట్లోకి నడిచాం.